క్లుప్తంగా

492 మందికి ఆరోగ్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మంగళవారం ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. 492 మందికి వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఎస్తేరురాణి మాట్లాడుతూ 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఒకరిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. శిబిరంలో గైనికాలజిస్టు సంధ్య, శ్వేత, జనరల్ వైద్యుడు ప్రసాద్, సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, కార్యదర్శులు ఏకేబాబు, బి.మధు, ఎంఎల్‌హెచ్‌పీలు స్వప్న, స్పందన, అనూష, ఏఎన్‌ఎంలు ఎ.ఆంథోనిరాణి, జ్యోతి, అరుణ, ఎంపీహెచ్‌ఎలు బాబురావు, బాబావలి, విజయ్‌కుమార్, ఆశా కార్యకర్తలు జోజమ్మ, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జాన్‌బీ, మస్తానమ్మబాయి, నజరున్నీసాలు పాల్గొన్నారు.

తులసీ సీడ్స్‌లో విత్తనాల తనిఖీ



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ శివారులోని తులసీ సీడ్స్ విత్తన కర్మాగారాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ ఏడీఏ మధులేటి సోమవారం తనిఖీ చేశారు. శుద్ధిచేసిన విత్తనాలను హెచ్‌టీ పరీక్ష (హెర్బిసైడ్ టోలరెంట్) చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి తీసుకున్న విత్తనాలకు సంబంధించి వారితో అగ్రిమెంటు తప్పనిసరిగా ఉండాలన్నారు. అంతేకాక నాణ్యమైన విత్తనాలకు సంబంధించి, తాలు విత్తనాలకు సంబంధించి వేరువేరుగా రికార్డులు ఉండేలా చూడాలని చెప్పారు. నిల్వ ఉన్న స్టాకు రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట ఏఓలు సురేష్‌రెడ్డి, వాసంతి, విస్తరణాధికారి సుభాని, హకీమ్‌లు ఉన్నారు.

ముగిసిన మనోహర పండుగలు



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెంలో క్రైస్తవ ఆరాధన మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సువార్త సభలు (మనోహర పండుగలు) మంగళవారంతో ముగిశాయి. క్రీస్తు పరిచారకులు పలువురు వాక్యోపదేశం చేశారు. మార్నింగ్‌స్టార్ కళాశాల నిర్వాహకులు ఫాదర్ ఎం.బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ ప్రతి ఒక్కరూ ప్రేమపూరిత మార్గంలో పయనించాలని చెప్పారు. క్రీస్తునందలి విశ్వాసం ప్రతి ఒక్కరిని ముందుకు బలమైన మార్గంగా నడిపిస్తుందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ నెహెమ్యా, సునీల్‌కుమార్, దియ్యా ప్రసాద్, కె.జాన్‌బాబులు పాల్గొన్నారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు అప్రమత్తంగా ఉండాలి



మంగళగిరి: ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు జరిగేలా ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి సూచించారు. మంగళవారం నియోజవకవర్గంలో ఏర్పాటు చేసిన 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో సమావేశం నిర్వహించి పలు జాగ్రత్తలు సూచించారు. తొలుత రాజకీయపార్టీల కార్యాలయాల వద్ద, తాత్కాలిక కేంద్రాల వద్ద నిబంధనల అతిక్రమించారా, లేదా అని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్‌లు, బ్యానర్‌లు, ఫ్లెక్సీలు కనిపిస్తే వెంటనే తొలగించాలని ఆదేశించారు.

తనిఖీల్లో రూ.99వేలు స్వాధీనం

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు చెక్‌పోస్టు వద్ద అనధికారికంగా తరలిస్తున్న రూ. 99వేలు నగదును మండల తహసీల్దార్ రాజ్యలక్ష్మి, మేడికొండూరు పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. తహసీల్దారు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల్లో భాగంగా మేడికొండూరు మండలంలో వాహనాలు తనిఖీలు జరుగుతున్నాయన్నారు. అధిక మొత్తంలో నగదు తరలిస్తే అలాంటివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలించాలంటే సంబంధిత అధికారుల వద్ద అనుమతులు తీసుకోవాలని రాజ్యలక్ష్మి తెలిపారు. పట్టుబడిన నగదును అధికారులకు అప్పజెప్పారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- రాష్ట్రవ్యాప్తంగా రైతులందరు సుభిక్షంగా ఉన్నారు
- ఇచ్చిన మాట ప్రకారం ల్యాండ్ పూలింగ్ ఎత్తివేశారు
- రైతులు సుభిక్షంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

తాడేపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతుల జీవితాలు బాగుండాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బాటలో నడుస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులను ఆదుకుంటున్నారని, మంగళగిరి నియోజకవర్గంలో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాండ్ పూలింగ్ విధానాన్ని ఎత్తివేశారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ పెనుమాక కార్యాలయంలో మేకా దామేష్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ శివారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కళ్ళం అరవిందరెడ్డి ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ ఎంతో అభివృద్ధి చెందిన మంగళగిరి నియోజకవర్గంలో పంటపొలాలు ఎంతో విలువైనవని, పలురకాల పంటలు ఇక్కడి నుంచి దేశవ్యాప్తంగా రవాణా చేస్తున్నారని అలాంటి పొలాలను గత ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ పెట్టి అమ్మకాలు, కొనుగోలు లావాదేవీలు జరగకుండా ఆంక్షలు విధించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ల్యాండ్ పూలింగ్ ఎత్తివేశారని, అలాగే పెనుమాకలో ఉన్న రైతు కూలీలకు ఇస్తున్న రూ.2500 పెన్షన్‌ను రూ.5 వేలు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకునేందుకు ప్రతి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన అన్ని రకాల పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారని, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్స్యూరెన్స్‌తోపాటు ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, రైతు పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుంటే రైతులతోపాటు, బడుగు బలహీనవర్గాల జీవితాలు బాగుంటాయని ఆయన అన్నారు. మొదటి నుంచి వైఎస్సార్ సీపీకి పెనుమాక మంచి పట్టున్న గ్రామమని, ఇక్కడ మాజీ ముఖ్యమంత్రి కుమారుడిపై ఒక బీసీ మహిళ మురుగుడు లావణ్య పోటీ చేస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించాలనే ఉద్దేశ్యంతో బీసీ మహిళను ఎంపిక చేశారన్నారు. ఎన్నికల్లో మురుగుడు లావణ్యను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. మాజీ సొసైటీ ప్రెసిడెంట్ మేకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు నాని, మైనార్టీ నాయకుడు బషీర్, అచ్యుతరావు, రవీంద్రరెడ్డి, నామతోటి నాగేశ్వరరావు, అచ్యుతరావు, ప్రభాకర్‌రెడ్డి, భుజంగరావు, అన్నూరు సుబ్బారావు, పోలిశెట్టి సాంబయ్య, పలగాని సాంబయ్య, గోపిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ కూటమిని చిత్తుగా ఓడిస్తాం

- ఎన్నికలప్పుడే మంద కృష్ణకు మాదిగలు గుర్తుకువస్తారు
- మంద కృష్ణ చంద్రబాబు వద్ద ప్యాకేజీ తీసుకున్నాడనేందుకు ఆధారాలున్నాయి
- మాదిగ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కో–కన్వీనర్, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు చెరుకూరి కిరణ్ ధ్వజం



విలేకరులతో మాట్లాడుతున్న చెరుకూరి కిరణ్, తదితరులు

మంగళగిరి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికలలో మళ్లీ గెలుపించుకోవాలని మాదిగ కార్పొరేషన్ సాధన సమితి రాష్ట్ర కో–కన్వీనర్ , వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు చెరుకూరి కిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఐబీఎన్ ప్రెస్ క్లబ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆయా వర్గాలు ఏకమై వైఎస్సార్ సీపీకి అండగా నిలవడంతో పాటు టీడీపీని చిత్తుగా ఓడిస్తామన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడు మంద కృష్ణకు ఎన్నికలప్పుడు మాత్రమే మాదిగలు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కోసం మాదిగలను చంద్రబాబుకు తాకట్టుపెట్టడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ కులంలో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అన్న చంద్రబాబుకు అండగా ఉండమని మంద కృష్ణ చెప్పడం మాదిగలందరినీ అవమానించడమేనన్నారు. గత ఎన్నికల సమయంలో టీడీపీ బీజేపీలను ఓడించాలని చెప్పిన మంద కృష్ణ, నేడు మళ్లీ వాళ్ళనే గెలిపించడం వెనుక కారణమేంటని నిలదీశారు. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని చెప్పిన మంద కృష్ణ నేడు మళ్లీ బీజేపీ కూటమికి ఏ విధంగా ఓటు వేయమని అడుగుతున్నారన్నారు. ఎమ్మార్పీఎస్‌ను అడ్డుపెట్టుకుని గత 30 సంవత్సారాలుగా మంద కృష్ణ మాదిగలను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. మాదిగల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎంని ఓడించమని చెప్పడం దారుణమన్నారు. కురుక్షేత్రం సభ పెట్టినప్పుడు చంద్రబాబు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టిన ఘటనలు మాదిగలు జీవితంలో మరువలేరన్నారు. ఏపీలో మంద కృష్ణ ఆటలు సాగవని గుర్తించుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో మందకృష్ణకు చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రంలో బీజేపీకి భారీ మెజార్టీ ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణ ఇప్పటివరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సమావేశంలో విజయవాడ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీను, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మేరీ కుమారి, యూత్ కార్యదర్శి జె.మార్కులు పాల్గొన్నారు.

నృసింహ మాలధారుల ఇరుముడులు



మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ మాల ధరించిన స్వాములు మంగళవారం ఇరుముడులతో మాల విరమణ చేశారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి మాల ధరించిన భక్తులు ఇరుముడులతో స్వామి వారిని దర్శించుకుని సాయంత్రం గిరిప్రదక్షిణ అనంతరం ఆలయంలో ఇరుముడులను స్వామి వారికి సమర్పించారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



మంగళగిరి: రానున్న మూడు నెలల్లో ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా వుండాలని ఎంటీఎంసీ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం తాగునీటి సరఫరాపై ఆయా శాఖల అధికారులు, సచివాలయాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాపై సచివాలయాల సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి ఆయా పరిధులలోని తాగునీటి సరఫరా, నీటి కుళాయిలు, చేతిపంపులు పనిచేస్తున్నాయా లేదా అని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పైపులైన్లు మరమ్మతులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటికొరత వున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఎస్‌ఈ నాగమల్లేశ్వరరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

ముగిసిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: పట్టణ చెంచుపేట అమరావతి కాలనీలోని గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 13 నుంచి జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం నిత్య హోమం, మహాపూర్ణాహుతి, వసంతోత్సవం జరిపారు. స్వామి వారికి చక్రస్నానం చేయించారు. విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. ఆలయంలో సాయంత్రం పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, ఆశీర్వచనం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

యువ పారిశ్రామికవేత్తలకు వీఐటీ ఏపీ అండ

వీఐటీ – ఏపీలో ఘనంగా జాతీయ స్థాయి వ్యాపార ప్రణాళిక – గ్రాండ్ ఫైనల్ అవార్డు వేడుకలు



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న వీసీ, అధ్యాపకులు

తాడికొండ: యువ పారిశ్రామిక వేత్తలకు వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయం ఆర్థికంగా, సాంకేతికంగా మద్దతు అందిస్తుందని వీఐటీ ఏపీ వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి అన్నారు. ఐనవోలు వీఐటీ – ఏపీలో నిర్వహించిన 3వ వార్షిక జాతీయస్థాయి వ్యాపార ప్రణాళిక పోటీ, గ్రాండ్ ఫైనల్, అవార్డు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వీఐటీ– ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ మరియు ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూవర్‌షిప్ సెల్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువ పారిశ్రామిక వేత్తలకు పేటెంట్ ప్రచురణలు, పరిశోధనా ర్యాంకింగ్‌లలో తమ విశ్వ విద్యాలయం సాధించిన విజయాలు వివరించారు. వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ పారిశ్రామికవేత్తల ప్రయాణంలో ఆవిష్కరణల ఆవశ్యకతను తెలియజేసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వైఫల్యాలతో నిరుత్సాహపడకుండా వాటి నుంచి నేర్చుకోవాలని సూచించారు. టీఐఈ విశాఖ ప్రెసిడెంట్, ఎ హబ్ సీఈఓ రవి ఈశ్వరపు మాట్లాడుతూ వ్యవస్థాపక ప్రయాణం చాలా సవాలుతో కూడుకున్నదని, సొంత కుటుంబం నుంచి కూడా చాలా ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అయితే సవాళ్లు ఉన్నప్పటికీ విజయవంతం కావాలంటే వ్యవస్థాపకతపై మక్కువ కలిగి ఉండాలన్నారు. వాధ్వాని ఫౌండేషన్ ప్రిన్సిపాల్ ఎంటర్‌ప్రెన్యూర్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఆర్.సుజాత మాట్లాడుతూ వాధ్వాని ఫౌండేషన్ 19 దేశాలలో యువ పారిశ్రామికవేత్తలకు మూలధన వ్యయం మరియు శిక్షణా కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సహకారం గురించి మాట్లాడారు. విద్యార్థుల్లో వ్యవస్థాపక స్ఫూర్తిని పెంపొందించడంలో వీఐటీ ఏపీ వర్సిటీ కృషిని వీఐటీ – టీబీఐ డైరెక్టర్ డాక్టర్ ఎ.బాలచంద్రన్ అభినందించారు. ఈ పోటీలలో దేశంలోని ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు మరియు ఇతర ప్రతిష్టాత్మక సంస్థలతో సహా 72 వర్సిటీలకు చెందిన 850 జట్లు పాల్గొన్నాయి. ఇన్నోవేషన్ ఇన్ టెక్నాలజీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్‌కేర్ అండ్ అగ్రికల్చరల్ అడ్వాన్స్‌మెంట్‌లు, డిజిటల్ మరియు ఎన్విరాన్‌మెంటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనే ప్రధాన అంశాలలో నిర్వహించిన ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు రూ.3 లక్షల విలువైన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఈసీ డైరెక్టర్ డాక్టర్ అమీత్ చవా, వి–లాంచ్ పాడ్–2024 కన్వీనర్ డాక్టర్ ఉషా శేషాద్రి, వీఐటీ– ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్‌లు డాక్టర్ అరుణ్ కుమార్, శివకుమార్ పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చలపతిలో ‘భరతనాట్యం’ యూనిట్ సందడి



విద్యార్థులతో మాట్లాడుతున్న భరతనాట్యం సినిమా యూనిట్

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం భరతనాట్యం సినిమా యూనిట్ సందడి చేశారు. మూవీ ప్రమోషన్‌లో భాగంగా కళాశాల విచ్చేసిన సినిమా హీరో సూర్యతేజ, హీరోయిన్ మీనాక్షి గౌతమిలు కొన్ని సినిమా పాటలకు ఆడిటోరియంలో కొన్ని పాటలకు విద్యార్థులతో కలిసి డాన్స్ చేసి అలరించారు. కొన్ని ముఖ్య సన్నివేశాలను అనుకరిస్తూ విద్యార్థులతో మమేకమవడంతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమాలో దర్శకుడు కేవీఆర్ మహేంద్ర, నిర్మాత పాయల్ సరాఫ్, తారాగణం పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వచ్చే నెల 5న విడుదల కానున్న సినిమాను ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జం సాయిప్రసాద్‌కు అభినందనలు



బెజ్జం సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న తాడికొండ, నిడుముక్కల సర్పంచ్‌లు, నాయకులు

తాడికొండ: బెజ్జం సాయిప్రసాద్‌ను వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడిగా నియమించడం హర్షణీయమని తాడికొండ, నిడుముక్కల గ్రామ సర్పంచ్‌లు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, తుళ్ళూరు మండల ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు అన్నారు. తాడికొండ మండల సేవాదళ్ అధ్యక్షుడుగా బెజ్జం సాయిప్రసాద్ నియామకం జరిగిన నేపథ్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. కరోనా కష్టకాలంలో వందలాది మంది పేదలకు నిత్యావసరాలు, సరుకులు, బియ్యం పంపిణీ చేసిన ఆయనకు తగిన పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారని కొనియాడారు. ఈ సందర్భంగా బెజ్జం సాయిప్రసాద్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల ఆంద్రేయప్ప, డీజే శ్రీను, కొదమల బుజ్జి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన సాయినాథ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుచరిత, వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి రోశయ్య

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్‌లోని షిర్డీ సాయినాథ ఆలయ 22వ వార్షికోత్సవం మంగళవారంతో ముగిసింది. ఉదయాన్నే వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, కె.రాఘవేంద్రశర్మలు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తుల స్వహస్తాలతో ఉత్సవమూర్తికి అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాటుచేశారు. శీతలాంబ అమ్మకు విశేష కుంకుమార్చనలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు...

సాయినాథ ఆలయ పూజల్లో ప్రతిపాడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత, గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్యలు పాల్గొన్నారు. వారికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు యెంద్రెడ్డి యల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు శేషవస్త్రంతో ఆహ్వానించారు. పూజల్లో పాల్గొని భక్తులకు ప్రసాదాలు అందజేశారు. 3వేల మంది భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నన్నం సునీత, మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, బి.అంజిరెడ్డి, మేడాబాబు, కె.చిన్నప్పరెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి, రామమోహన్‌రెడ్డి, షేక్‌గౌస్, పి.చిన్న, సాలె రాయప్ప, సాలె నాగరాజు, డి.నరేంద్ర, వి.పిచ్చిరెడ్డి, చౌదయ్య, డి.మెల్కియా, వి. శంకర్, హేమలతారెడ్డి, ఎం.సుధాకరరెడ్డిలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలి



వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యను కలిసిన దుగ్గిరాల నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన నవులూరు యువకులతో మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

- పార్టీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య
- పార్టీలో చేరికలు

మంగళగిరి: నవులూరుకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో యువకులు చేరారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య నివాసంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో యువకులకు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని భారీగా మెజార్టీతో గెలిపించాలని లావణ్య కోరారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండలం మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, మల్లెల లక్ష్మయ్య, దుర్గి కోటయ్య, మోరంపూడి రాజు, చిలక చంటి, మున్నా బాజీ, ఖాదరవలీ, వెంకటరావు, హుమేర్ బాషాలున్నారు. నవులూరు నుంచి పార్టీలో చేరిన వారిలో శ్రీను, కార్తీక్, సాంబ, చింటూ, కన్న, రాజు, అశోక్, ఏసుదాసు తదితరులున్నారు.

పెమ్మసాని వ్యాఖ్యలు దారుణం

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: ముస్లిం మైనార్టీల మనోభావాలను కించపరిచేలా సద్దాం హుస్సేన్ గురించి తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంటరీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు దారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. మంగళవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ విమర్శలు ఆయాపార్టీల పరంగా వారు అవలంభించిన విధానాలపై ఉండాలే గానీ వైఎస్సార్ సీపీ నాయకులు సద్దాం హుస్సేన్‌లా ప్రవర్తిస్తున్నారని, సద్దాం హుస్సేన్ కూడా తన ఇష్టారీతిగా వ్యవహరించినందుకే బంకర్‌లో దాగి వున్నా ఆయన్ను కుక్కను కొట్టినట్లు కొట్టి, చంపారని అసభ్యకరంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. పరమత సహనంతో మెలిగే భారతదేశంలో ముస్లింల మనోభావాలను కించపరిచేలా రాజకీయాలతో ముడిపెట్టి వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ముస్లిం సమాజానికి క్షమాపణ చెప్పి తన మాటలను చంద్రశేఖర్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాను సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలను అగౌరవ పరిస్తే సహించం...

తాడేపల్లిరూరల్: ముస్లింల ఐక్యత కోసం పోరాటం చేసి అమెరికా లాంటి అగ్రరాజ్యాలు పన్నిన కుతంత్రాలకు బలైన సద్దాం హుస్సేన్‌ను కించపరిచేలా మాట్లాడితే ముస్లింలు సహించరని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ మైనార్టీ సెల్ నాయకుడు, తాడేపల్లి మాజీ కౌన్సిలర్ ఎం.డి. గోరేబాబు అన్నారు. మంగళవారం నులకపేటలో ముస్లింల ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అగ్రరాజ్యమైన అమెరికాలో అడ్డగోలుగా సంపాదించి తన కులం కోసం వారి నాయకులను కాపాడడం కోసం ముస్లింలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్న బీజేపీతో కుమ్మక్కై ముస్లిం వేషధారణలో ముస్లింలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, గుంటూరు పార్లమెంట్‌స్థానంలో ముస్లింలు 3.50 లక్షల మంది ఉన్నారని, ముస్లింల మనోభావాలను దెబ్బతీసే పార్టీతో జతకట్టిన మీలాంటివాడికి ముస్లిం సోదరులందరూ కలసి కట్టుగా బుద్ధి చెబుతారన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారని, దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా ముస్లింలకు అవకాశం కల్పించారని, ఆయన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలకు రాష్ట్రంలో ప్రాధాన్యతనిచ్చి పాలన సాగిస్తుంటే మీరు ఒక మతతత్వ పార్టీతో మద్దతు పెట్టుకుని ముస్లింల మనోభావాలను దెబ్బతీసేవిధంగా మాట్లాడితే సహించేది లేదని ఆయన అన్నారు. తాడేపల్లి మైనార్టీ సెల్ నాయకులు ఇర్ఫాన్, జిలాని, మతీన్, షఫీ, బాజీ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరూ వినియోగించాలి

ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్లు వర్గీస్, ధనుంజయ్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్ ధనుంజయ్

తాడేపల్లిరూరల్: అధిక పోషక విలువలు కలిగి వున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరూ వినియోగించాలని ఎఫ్‌సీఐ తాడేపల్లి డిపో మేనేజర్లు వర్గీస్, ధనుంజయ్ అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేనేజర్ క్యూసి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రక్తహీనతను పోగొట్టే ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నామని అన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి విటమిన్లు పుష్కలంగా లభిస్తాయని వివరించారు. బియ్యాన్ని కడిగినప్పుడు వచ్చే నీటిలో అనేక పోషకాలు ఉంటాయని తెలిపారు. తాడేపల్లి ఎఫ్‌సీఐ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.